ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 25.0

చట్టాలపై మరింత విజ్ఞానం పెంచుకోవాలి

7

» రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

కొత్త కలెక్టర్ల నియామకం

ఏలూరుకు వెట్రిసెల్వి పశ్చిమకు నాగరాణి

» జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రసన్న వెంకటేశ్‌కు ఆదేశం

» చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ బదిలీ


వెట్రిసెల్వి


ప్రసన్న వెంకటేశ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లను మారుస్తూ శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో జిల్లాల కలెక్టర్లను మారుస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. ఏలూరు కలెక్టర్‌గా వెట్రిసెల్విని, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా చదలవాడ నాగరాణిని నియమించింది. ఏలూరు జిల్లా కలెక్టర్‌గా 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వెట్రిసెల్విను నియమించారు. ప్రస్తుత కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేశ్‌ను జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. వెట్రిసెల్వి అత్యంత సమర్థురాలైన అధికారిణి. సీఎం చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో తన సమర్థతను చాటుకున్నారు. కుప్పం స్పెషల్ ఆఫీసర్‌గా అందరి మన్ననలు అందుకున్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్‌గా తనదైన శైలిలో రాణించారు. నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా వ్యవహరించారు. సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్‌గా కొన్నాళ్లపాటు పనిచేశారు. జగన్ హయాంలో పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం అభివృద్ధికి ప్రత్యేకాధికారిగా సెల్వి సేవలను వినియోగించుకున్నారు. తాజాగా మహిళా శిశు శాఖ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏ పోస్టులో ఉన్నా సమర్థవంతమైన అధికారిణిగా ఆమె పేరు తెచ్చుకున్నారు. అందుకనే చంద్రబాబు సెల్విని ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ప్రసన్న వెంకటేశ్ 2022 జనవరిలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి రెండున్నరేళ్లపాటు పనిచేశారు. చాన్నాళ్ల నుంచి ఆయన బదిలీ తప్పకపోవచ్చని ఆంధ్రజ్యోతి ముందుగానే అంచనా వేసింది. దీనికనుగుణంగా ఆయన బదిలీ అయ్యారు.

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన నాగరాణి గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా వున్నారు. కలెక్టర్ హోదాలో మొదటిసారి పశ్చిమకు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సుమిత్‌కుమార్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా నియమించారు. భీమవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత 2022 ఏప్రిల్ 4న తొలి కలెక్టర్‌గా పి.ప్రశాంతి బాధ్యతలు స్వీకరించారు. పాలనను గాడిలో పెట్టారు. అప్పటి అధికార వైసీపీ నేతలతో ఏర్పడిన విభేదాలతో ఎన్నికల ముందు ఫిబ్రవరి 14న ఆమెను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో అల్లూరి సీతారామరాజు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఎన్నికలు సమర్థవంతంగా జరిగాయి. ఆయనను చిత్తూరు కలెక్టర్‌గా బదిలీ చేయగా, ప్రశాంతిని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.


సి.నాగరాణి


సుమిత్‌కుమార్

అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా వైష్ణవి

» రాజధాని నిర్మాణానికి రూ.25 లక్షల చెక్కు అందజేత.. సత్కరించిన సీఎం చంద్రబాబు

ముదినేపల్లి, జూన్ 22 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా ఏలూరు జిల్లా ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తిరిగి నియమితులయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎం కార్యాలయ అధికారులకు ఆదేశించారు. గతంలో అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.10 లక్షలు విరాళం అందజేసిన సమయంలో వైష్ణవిని చంద్రబాబు అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాకపోవడంతో ఆ పదవీ రద్దయింది. ఇప్పుడు మరల టీడీపీ అధికారంలోకి రావడంతో తాజాగా శనివారం సాయంత్రం వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్‌తో పాటు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనను కలసి అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.25 లక్షలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. లక్ష విరాళంగా చెక్కులు అందజేశారు. ఇందుకు తమకు ఉన్న మూడు ఎకరాల పొలంలో ఎకరం భూమి, తన బంగారపు గాజులు అమ్మి రూ.26 లక్షలు విరాళంగా ఇస్తున్నట్టు వైష్ణవి, ఆమె తండ్రి మనోజ్ తెలపగా చంద్రబాబు కళ్లు చెమర్చాయి. చిన్న వయస్సులోనే ఉదారతను చూపిస్తూ రాష్ట్ర రాజధాని నిర్మాణానికి పొలం అమ్మి విరాళం ఇవ్వడం పట్ల చంద్రబాబు వైష్ణవిని అభినందించి సత్కరించారు. వైష్ణవి ఉదారత అమరావతి నిర్మాణానికి స్ఫూర్తిదాయకంగా ఉందంటూ వెంటనే తన కార్యాలయ అధికారులను పిలిచి ఆమెను తిరిగి అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించాలని ఆదేశించారు. ఎంబీబీఎస్ చదువుతున్న వైష్ణవిని బాగా చదువుకోవాలని చంద్రబాబు సూచించారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి కూడా వైష్ణవి ఉదారతను అభినందించారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజధాని నిర్మాణానికి రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న వైష్ణవి, తండ్రి మనోజ్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

» 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు, జూన్ 22 : జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకుని పరిష్కరించదగ్గ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు, పోలీస్ అధికారులు కృషి చేయాలని, 15వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ ఎ.నాగశైలజ కోరారు. నూజివీడు కోర్టు హాలు ప్రాంగణంలో శనివారం ఆమె న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన నూజివీడు కోర్టుహాలు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తారని, సివిల్, పరిష్కరించదగ్గ క్రిమినల్ కేసులు, వివాహ సంబంధ కేసులు, చెక్‌బౌన్స్, వాహన ప్రమాద ఇన్సూరెన్స్ కేసులు పరిష్కరిస్తారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి షేక్ పెదకాశీం, జూనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు, మొదటి అదనపు సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు, 2వ అదనపు సివిల్ జడ్జి కె.శివపార్వతి, ప్రత్యేక న్యాయమూర్తి వి.కృష్ణమూర్తి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జేడీ గాంధీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో 42.2 మి.మీ వర్షపాతం

ఏలూరుసిటీ, జూన్ 22: జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావం ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది. జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ఉంగుటూరు మండలంలో 42.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో శనివారం కూడా అక్కడక్కడా వర్షాలు కురిశాయి. జిల్లాలో 30 డిగ్రీల సెంటీగ్రేడ్ పగటి ఉష్ణోగ్రత మాత్రమే నమోదైంది. జిల్లాలో గడచిన 24 గంటల్లో సరాసరి వర్షపాతం 13.1 మి.మీగా నమోదైంది. వేలేరుపాడులో 39, నిడమర్రులో 37.6, కుక్కునూరులో 32.2, కొయ్యలగూడెంలో 27.8, పెదవేగిలో 24, ఏలూరు రూరల్‌లో 18.6, నూజివీడులో 18.2, జీలుగుమిల్లిలో 16.8, జంగారెడ్డిగూడెంలో 14.2, పోలవరంలో 13.6, బుట్టాయిగూడెంలో 13.6, ముసునూరులో 12.2, ఆగిరిపల్లిలో 9.8, చాట్రాయిలో 7.2, భీమడోలులో 7.2, ఏలూరు అర్బన్‌లో 6.8, దెందులూరులో 6.2, కామవరపుకోటలో 3.2, ద్వారకాతిరుమలలో 3, కలిదిండిలో 2.8, చింతలపూడిలో 2.6, ముదినేపల్లిలో 2.2, లింగపాలెంలో 2.2, టి.నరసాపురంలో 2.2, పెదపాడులో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో సార్వా సాగు పనులపై రైతులు దృష్టి సారించారు.

పోలవరంలో భారీ వర్షం

పోలవరం : పోలవరం మండలంలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట, ఎల్ఎన్‌డీ పేట, చేగొండపల్లి, జిల్లెల్లగూడెం, కొండ్రుకోట పంచాయతీల్లో పలుచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.




కొల్లేరు కాంటూరు భూముల్లో మెరక పనుల పేరుతో చెరువులకు గట్లు వేస్తున్న మాఫియా (ఫైల్)

కొల్లేరు కొల్లగొట్టు

మెట్ట దుక్కు పేరుతో పనులకు యత్నం

» ప్రభుత్వం మారినా వెనక్కి తగ్గని మాఫియా

» రైతులను అడ్డం పెట్టుకుని చెరువులు తవ్వేందుకు రంగం సిద్ధం

కొల్లేరు కాంటూరు భూములపై మాఫియా కన్ను వీడడం లేదు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వంలో తమకు అనుకూలమైన వారితో సంప్రదింపులు మొదలుపెట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ అధికారులను భయపెట్టి దౌర్జన్యంగా ప్రజా ప్రతినిధుల అండతో చెరువుల తవ్వకానికి అనుకూలంగా తమ భూములను సిద్ధం చేశారు. గత ఐదేళ్లుగా పంట వేయకుండా ఉన్న భూమిని మట్టి పనుల పేరుతో, మెట్ట దుక్కు పేరుతో అటవీశాఖ అధికారులను మభ్యపెట్టి చెరువుల అక్రమ తవ్వకాలకు తెరలేపారు.

నిడమర్రు జూన్ 22 : సుమారు 450 ఎకరాలు చెరువు తవ్వకం కోసం మెట్ట దుక్కు పేరుతో ఏక గట్టు వేయడం కోసం పాత పొలం గట్లు తీసివేసి ఏకచెరువుకు అనుకూలంగా తయారుచేశారు. అటవీ శాఖ అధికారులు వ్యవసాయం కోసం ఇలా చేయరు కదా అని ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా తిరిగి తమపై వారు జులుం ప్రదర్శిస్తున్నారని, కిరాయి మనుషులను అడ్డంపెట్టుకొని దౌర్జన్యంగా పనులు కానిచ్చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వ పెద్దలతోనూ, స్థానిక ప్రజాప్రతినిధులతో తమ పని కానిచ్చేయడానికి అప్పుడే లాబీయింగ్‌లు మొదలుపెట్టే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పెద్దలు కొల్లేరు మాఫియాకు సహకరిస్తారా.. లేదా కొల్లేరు పరిరక్షిస్తారా.. అని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

చెరువులపై మాఫియా డేగ కన్ను

నిడమర్రు మండలం పెదనింద్రకొలను పెద్దింట్లమ్మ గుడి నుంచి ఐదు కిలోమీటర్ల లోపలకు గల కొల్లేరు కాంటూరు పొలాల్లో సుమారు 450 ఎకరాలు చెరువుల తవ్వకానికి రంగం సిద్ధం చేస్తున్నారు. క్రొవ్విడి ఉప్పరగూడెం శివారులోని కాంటూరు భూముల్లోను చెరువుల తవ్వకాలకు రంగం సిద్ధమవుతున్నట్టు సమాచారం. వర్షాకాలానికి ముందే ఏదో ఒకరోజు ఒక్కసారిగా 400 పైచిలుకు ట్రాక్టర్లతో ఈ పని పూర్తి చేయడానికి తగిన ఏర్పాట్లలో మాఫియా నిమగ్నమైనట్టు సమాచారం. క్రొవ్విడిలో సుమారు 1000 ఎకరాల్లో ఈ చెరువుల తవ్వకాలను రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. చిన్న, సన్న కారు రైతులు సాగు చేసుకునే వ్యవసాయ భూములపై పెద్దల డేగ కన్ను పడింది. రైతులకు చెరువు లీజుల ఆశ జూపి తమ అక్రమ సంపాదనకు మార్గం సుమగమం చేసుకుంటున్నారు. స్థానికంగా గల గత అధికార పార్టీ నాయకులు దీనికి బాధ్యత తీసుకుని రైతులను ఒప్పించి నట్టు సమాచారం. మొత్తం వ్యవహారమంతా గ్రామంలోని వైసీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. కొంతమంది రైతులు ధైర్యం చేసి తామే సొంతంగా తవ్వుకుంటామని చెబితే అదెలా కుదురుతుందని బెదిరిస్తున్నారు. తమను కాదని నువ్వు చెరువు ఎలా తవ్వగలవో చూద్దామంటూ హెచ్చరిస్తున్నారు.


కాంటూరు భూముల్లో మెరక పనుల పేరుతో చెరువులకు గట్లు వేస్తున్న దృశ్యం (ఫైల్)

ఇదీ రైతుల మొర

కొల్లేరు కాంటూరు భూముల విషయంలో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. తాతల కాలం నాటి నుంచి వారసత్వంగా పొందిన పొలాలు ప్రస్తుతం సాగుకు అనుకూలంగా లేవు. దీనికి ప్రధాన కారణం కొల్లేరు కాంటూరు భూముల్లో 3 కాంటూరు లోపల గల నడి కొల్లేరులో గల వ్యవసాయ భూములను ఆక్రమించి మాఫియా కొన్నేళ్లుగా చెరువుల సాగు చేస్తోంది. గతంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన లవ్ అగర్వాల్ ప్రత్యేకంగా కొల్లేరు ఆపరేషన్ నిర్వహించి బాంబులతో ఆక్రమంగా తవ్విన చెరువుల గట్లు పేల్చివే శారు. ఆయన ఉన్నంత కాలం సైలెంట్‌గా ఉన్న మాఫి యా ఆయన బదిలీ అయిన వెంటనే మళ్లీ మిషన్లతో గట్లు వేసి దర్జాగా సాగుచేస్తున్నారు. దీనికి అప్పట్లో కొంతమంది ప్రజాప్రతినిధుల ఆశీస్సులు ఉన్నట్టు ఆరోపణలున్నాయి.

కొల్లేరు మూడో కాంటూరు లోపల గల మురుగు బోదెలు, దారులు ఆక్రమించి ఒక్కొక్కటి 100 నుంచి 150 ఎకరాలు చెరువులను తవ్వకం చేశారు. ఈ విధంగా మురుగు బోదెలు, దారులు ఆక్రమించడం వల్ల పైనుంచి వచ్చే మురుగు పూర్తి స్థాయిలో కొల్లేరు సరస్సులోకి వెళ్లక ఎగదన్నుతోంది. ఆరు కాలం కష్టపడి వ్యవసాయం చేసుకుంటున్న రైతులు తమ చేలల్లో మురుగునీరు కిందకు వెళ్లకపోవడంతో కొన్నేళ్ళుగా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల రొయ్యల చెరువుల సాగు పెరగడంతో మురుగునీరు కాల్వలన్నీ ఉప్పు నీటిమయం కావడంతో రైతులు వేసిన వరి పంట బతకడం లేదని ఆందోళన చెందుతు న్నారు. సంప్రదాయ వ్యవసాయం చేసుకునే రైతులు తమ పొలాల నుంచి మురుగునీరు పోయే కాల్వలను బాగు చేయమని ఎన్నో ఏళ్లగా ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకుంటున్నారు. కానీ ప్రజా ప్రతినిధులు ఈ విషయంపై శ్రద్ధ పెట్టకపోవడంతో రైతులు తమ పొలాలను సాగు చేయలేక బీడు భూములుగా వదిలి వేశారు. ఇదే అదను కోసం చూస్తున్న మాఫియా మధ్యవర్తులసాయంతో వారిపై ఒత్తిడి తెచ్చి అక్రమ చెరువుల తవ్వకాలకు తెరలేపుతున్నారు. నూతన ప్రభుత్వమైనా కొల్లేరు కాంటూరు భూముల విషయమై సమగ్రసర్వే సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు. తమ భూముల్లో సంప్రదాయ వ్యవసాయ సాగుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొల్లేరుకు పూర్వ వైభవం తీసుకొచ్చి పర్యావరణం కాపాడాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

అటవీ అధికారుల చర్యలేవీ ?

కొల్లేరు కాంటూరు భూములపై కన్నేసిన మాఫియా మార్చిలో చెరువుల తవ్వకాలను చేపట్టారు. కొందరు రైతులతో ఒప్పందం చేసుకుని మార్చి 27న నిడమర్రు కొల్లేరు ఆయకట్టు పరిధిలో సుమారు వందకు పైగా ట్రాక్టర్లను ఎక్కువ కిరాయికి మాట్లాడుకుని మెట్టదుక్కు ముసుగులో వందెకరాల చుట్టూ మూడు అడుగుల మేర మట్టిని పోగు చేసి గట్టు వేయడం ప్రారంభించారు. ఈ విషయం తెలిసి జిల్లా అటవీ శాఖ అధికారులు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పనుల నిలుపుదలకు ప్రయత్నించగా రైతులు టెంట్ వేసి తమ భూముల్లో పనులు చేసుకుంటుంటే మీరెందుకు ఆపుతారంటూ అడ్డం తిరిగారు. చివరకు అక్కడ వ్యవసాయం మాత్రమే చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వితే చర్యలు తీసుకుంటామంటూ భూయజమానులైన రైతులకు, ట్రాక్టర్ల యజమానులకు జిల్లా అటవీ శాఖాధికారిణి హిమశైలజ నోటీసులు జారీచేశారు. అప్పటి వరకు వేసిన పెద్ద గట్లు తొలగించాలని ఆదేశించారు. ఇది జరిగి 90 రోజుల గడవక ముందే కొందరు మళ్లీ రైతులను అడ్డం పెట్టుకుని చెరువుల తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారు.

హుండీ లెక్కింపులో

చేతివాటం

» కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయంలో రూ.50 వేలు కొట్టేసిన ఉద్యోగి.. విధుల నుంచి తొలగింపు

» పూర్తి స్థాయి విచారణకు కొల్లేటి వాసుల డిమాండ్

కైకలూరు, జూన్ 22 : హుండీ లెక్కింపులో ఓ ఉద్యోగి చేతి వాటం ప్రదర్శించాడు. కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయంలో వెలుగుచూసిన ఈ ఘటన వివరాలివి.. మూడేళ్ల క్రితం శృంగవరప్పాడు శివారు గోకర్ణపురానికి చెందిన సాయిచందు అప్పటి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సిఫారసుతో పార్ట్ టైం ఉద్యోగిగా పెద్దింటమ్మ ఆలయంలో చేరాడు. ఈ నెల 19న గుడివాడ దేవదాయ శాఖ అధికారులు, పోలీసు, రెవెన్యూ, గ్రామస్థుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఆ సమయంలో సాయిచందు చేతివాటాన్ని ప్రదర్శించి, రూ.50 వేలను పక్కకు విసిరేశాడు. దీనిని గమనించిన ఓ వ్యక్తి విషయాన్ని ఆలయ అధికారి కేవీ గోపాలరావు దృష్టికి తీసుకువెళ్లాడు. దీనిని ధ్రువీకరించేందుకు ఆలయ సీసీ కెమెరాలను పరిశీలించగా నగదు విసిరేయడం నిజమేనని తేలింది. దీనిపై సాయిచందును నిలదీయగా అతను నగదు తిరిగి ఇచ్చేశాడు. హుండీ లెక్కింపులో పాల్గొన్న గ్రామ సర్పంచ్ భర్త బలే సముద్రుడు దీనిపై పోలీసు కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఉద్యోగిని విధుల నుంచి తొలగిస్తామని, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలి పెట్టాలని ఆలయ అధికారి వారిని వేడుకున్నాడు. ఈ విషయం శనివారం కొల్లేటి గ్రామాల్లో గుప్పుమంది. దొంగ దొరికినా ఆలయ అధికారులు కప్పిపుచ్చడం వెనుక వారి హస్తం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. ఆ ఉద్యోగి గతంలోనూ ఇలాంటి తప్పిదాలు చేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తం చేస్తూ.. విచారణకు కొల్లేటి వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయ ఈవో గోపాలరావును వివరణ కోరగా హుండీల లెక్కింపు సమయంలో సాయిచందు నగదు అపహరణ చేసిన విషయం వాస్తవమేనని, అతన్ని విధుల్లో నుంచి తొలగించినట్టు స్పష్టం చేశారు.



గుడిని కూల్చినా.. విగ్రహాన్ని ధ్వంసం చేసినా చర్యల్లేవ్ !

వైసీపీ నేతలకు పోలీసుల అండ : దుర్గమ్మ పీఠం నిర్వాహకుడి ఆవేదన

ద్వారకా తిరుమల, జూన్ 22: 'హిందూ ఆధ్యాత్మిక కేంద్రాన్ని వాణిజ్య కేంద్రంగా మార్చలేదన్న కక్షతో వైసీపీ నేతలు కొందరు కనకదుర్గమ్మ పీఠాన్ని నేలమట్టం చేశారు. వారికి కొమ్ము కాస్తూ పోలీసులు కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారు' అని పీఠం నిర్వాహకుడు తోట గంగాదర్ భవాని ఆరోపించారు. ద్వారకా తిరుమల పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం గ్రామ పెద్దలతో కలిసి మాట్లాడారు. 'తిమ్మాపురం శివారులో హిందూ దళితులు ఆరేళ్లుగా కనక దుర్గమ్మ పీఠాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. గ్రామ వైసీపీ నాయకులు బొల్ల శ్రీను, మద్దిపాటి సత్యనారాయణ, అతని కుమారుడు పెదనాని, బన్నుతోపాటు వాసిరెడ్డి నరసింహరావు, అతని కుమారుడు సోంబాబు నన్ను, ఇతర నిర్వాహకులను పిలిచి పీఠానికి వచ్చే వారి నుంచి రూ.200 వసూలు చేసి అందులో సగం తమకివ్వాలని డిమాండ్ చేశారు. దీనికి నిరాకరించడంతో నన్ను కులం పేరుతో దూషించి, పీఠం నుంచి బయటకు గెంటేశారు. దీనిపై ఈ ఏడాది జనవరి 11న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆ రాత్రే వైసీపీ నేతలు అమ్మ వారి విగ్రహాన్ని ధ్వంసం చేసి, పీఠాన్ని కుప్పకూల్చారు. దీనిపై మేం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాం. ఈ క్రమంలో శనివారం నన్ను స్టేషన్‌కు రమ్మని ఎస్ఐ పిలవడంతో వెళ్లా. రికవరీ చేసిన దుర్గమ్మ విగ్రహాన్ని అప్పగించేందుకు పిలిచినట్టు తెలిపారు. గుడిని నేలమట్టం చేసిన మిషన్‌ను ఎందుకు సీజ్ చేయలేదని ప్రశ్నించాను. కూల్చివేతకు వినియోగించిన మిషన్ స్థానంలో వేరేది చూపిస్తున్నారు. పోలీసులు వైసీపీ నాయకులపై కొమ్ము కాస్తున్నారు. ఇంత వరకు సరైన విచారణ చేపట్టలేదు. గుడిని కూల్చి, విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు లేవు. కేసు పెట్టి ఐదు నెలలు గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయలేదు' అని గంగాధర్ పోలీసుల తీరును తప్పుపట్టారు.



ద్వారకా తిరుమల పోలీస్ స్టేషన్ వద్ద పోలీసుల తీరును తప్పు బడుతున్న పీఠం నిర్వాహకులు

శోక సంద్రం

» రామాపురం బీచ్‌లో గల్లంతైన మరో ఇద్దరి మృతదేహాల లభ్యం

» దుగ్గిరాలకు నలుగురు యువకుల మృతదేహాల తరలింపు.. ముగ్గురికి అంత్యక్రియలు

» మిన్నంటిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు

పెదవేగి, జూన్ 22 : నిన్న మొన్నటి వరకు తమతో కలిసి తిరిగిన ఆ నలుగురు విగత జీవులుగా మారడం కుటుంబీకులతో పాటు గ్రామస్థులు తట్టుకోలేక పోయారు. ఒకేసారి నలుగురు యువకుల మృతితో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం బీచ్ వద్ద సముద్రంలో పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామానికి చెందిన నలుగురు గల్లంతైన విషయం విదితమే. ఈ మేరకు విహార యాత్రలో అసువులు బాసిన మిత్రుల మృతదేహాలను తీసుకుని మిగిలిన స్నేహితులు విషాదంతో శనివారం సాయంత్రానికి స్వగ్రామానికి తిరిగొచ్చారు. పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన ఎనిమిది మంది, అంకన్నగూడేనికి చెందిన ఇద్దరు, పెదకడిమికి చెందిన ఒకరు.. మొత్తం 11 మంది మిత్రులు బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం బీచ్‌కు శుక్రవారం ఉదయం వెళ్ళి, సముద్రంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నలుగురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో రాత్రికి రెండు మృతదేహాలు లభ్యం కాగా మరో రెండు మృతదేహాలు శనివారం ఉదయం నాటికి లభ్యమయ్యాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తీసుకున్న చొరవతో మృతదేహాలకు శవపరీక్ష నిర్వహించి శనివారం సాయంత్రానికి స్వగ్రామం దుగ్గిరాల తీసుకొచ్చారు. మృతదేహాలను చూసిన బంధువులు, గ్రామస్థులు బోరున విలపించారు. అశ్రునయనాల మధ్య సాయంత్రం మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.


బంధువులు, స్నేహితుల రోదనలు


మృతుల కుటుంబ సభ్యుల రోదనలు

ప్రాణాలు తీసిన రాకాసి కెరటం

రామాపురం బీచ్‌లో అందరూ స్నానాలు చేసే చోటు కాకుండా కొంతదూరంలో వేరొకచోట సముద్రంలోకి దిగి స్నానం చేస్తుండగా ఒకసారిగా పెద్దగా వచ్చిన కెరటంతో తమ మిత్రులు సముద్రంలోకి కొట్టుకుపోయారని, వారిని కాపాడేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదని సహచర మిత్రులు విలపిస్తూ తెలిపారు. చనిపోయిన వారిలో జాలా కిశోర్ వంటమేస్త్రీగా, ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు యువకులు గొటికల తేజ (నాని), కోరు అమల్‌రాజులు ఇంటర్మీడియట్ పూర్తిచేసి, కూలిపనులు చేస్తున్నారు. మరొక యువకుడు చట్టుమాల నితిన్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. నితిన్ సోదరుడు వేరొక ప్రాంతంలో ఉండడంతో అతని అంత్యక్రియలను ఆదివారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేయగా మిగిలిన ముగ్గురికి అంత్యక్రియలు నిర్వహించారు.



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్.. పూలమొక్కను అందిస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్

చట్టాలపై మరింత విజ్ఞానం పెంచుకోవాలి

▸ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

ఏలూరు కలెక్టరేట్/ఏలూరు క్రైం, జూన్ 22: చట్టాలపై న్యాయమూర్తులకు విజ్ఞానాన్ని మరింత పెంచడానికి న్యాయాధికారుల వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వి.కృష్ణమోహన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ అధ్యక్షతన జస్టిస్ ఏవీ శేషసాయి ఆధ్వర్యంలో జిల్లాలోని న్యాయమూర్తులకు చట్టాలకు సంబంధించిన పలు అంశాలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయాధికారులకు ప్రామిసరీ నోటు దావాలలో అమలు, పిటిషన్‌పైన, చట్టాలపై స్థూలమైన, విధానపరమైన అవగాహన అవసరమన్నారు. ఇతర అంశాలపై న్యాయ విజ్ఞానంతో సన్నద్ధం చేయటానికి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వర్క్‌షాపులో రీసోర్స్‌పర్సన్ రిటైర్డ్ న్యాయమూర్తి, ఏపీఏటీ మాజీ చైర్మన్ వై.వి రామకృష్ణ పాల్గొని ఎగ్జిబిషన్ ఆఫ్ డిగ్రీఫర్ ఎవిక్షన్, డెలివరీ, డిటర్మినేషన్ చట్టాలపై మారుతున్న సవరణలపైన న్యాయమూర్తులకు వివరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలసిన జిల్లా అధికారులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయాధికారుల వర్క్‌షాపునకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, అదనపు ఎస్పీ జి.స్వరూప రాణి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు. వీరితో పాటు ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఏలూరు బార్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ పలువురు పూలమొక్కలను అందించారు.

డీజీపీకి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ



ఏలూరు క్రైం, జూన్ 22 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీహెచ్ ద్వారకాతిరుమలరావును ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి కలిశారు. శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీఐ ప్రవేశార్థులకు సూచన

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 22 : ఏలూరులోని ప్రభుత్వ ఐటీఐలో తొలివిడత అడ్మిషన్లకు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తుచేసుకున్న బాలబాలికల్లో అర్హతలుండీ కౌన్సెలింగ్‌కు హాజరుకాలేని వారికి ఈనెల 24న జనరల్ పూల్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.రజిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజున ఉదయం పది గంటలకు మెరిట్ నంబరు ఒకటి నుంచి 224వరకు, మధ్యాహ్నం ఒంటి గంటకు 225నుంచి 454 వరకు అభ్యర్థులు హాజరుకావచ్చని వివరించారు.

26న ఏలూరు ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 22 : ఉపాధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రజిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు హాజరయ్యే జాబ్‌మేళాకు ఐటీఐ ఉత్తీర్ణులై, అప్రంటీస్ పూర్తిచేసిన అభ్యర్థులు, ఐటీఐ చివరి ఏడాది చదువుతున్న ట్రైనీలు హాజరుకావచ్చన్నారు. అభ్యరుథలు తమ విద్యార్హతల ధ్రువీకరణపత్రాలు, ఐడీ ప్రూఫ్‌లు, పాస్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయం 08812-230269 నంబరులో సంప్రదించాలని కోరారు.

24న గురుకుల ప్రవేశానికి రాత పరీక్ష

పెనుగొండ, జూన్ 22 :పెనుగొండ సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఈనెల 24న ఉదయం 11 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్‌క్వీన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి 6,7,8,9వ తరగతులకు మిగులు సీట్లు భర్తీ చేసేందుకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరో తరగతి 41 సీట్లు, ఏడో తరగతికి మూడు సీట్లు, ఎనిమిదో తరగతికి మూడు సీట్లు, తొమ్మిదో తరగతికి ఐదు సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు.

శ్రీవారి క్షేత్రానికి టీడీపీ నేతల పాదయాత్ర



దొరాజీకి స్వాగతం పలుకుతున్న మండల నేతలు

ద్వారకాతిరుమల, జూన్ 22: చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పాటుబడుతుందని టీడీపీ నేత ముళ్లపూడి దొరాజీ చౌదరి అన్నారు. చంద్రబాబు సీఎం కావాలని, గోపాలపురం ఎమ్మెల్యేగా మద్దిపాటి వెంకట్రాజు గెలవాలని చినవెంకన్నకు మొక్కుకున్న తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరుకు చెందిన నేత ముళ్లపూడి దొరాజీ చౌదరి తలపెట్టిన భారీపాదయాత్ర శనివారం సాయంత్రం ద్వారకాతిరుమల మండలానికి చేరుకుంది. రాళ్లకుంట వద్దకు టీడీపీ నేతలు, తెలుగుమహిళలతో చేరుకున్న పాదయాత్రకు పార్టీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, మొగతడకల శ్రీనివాసరావు తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం శ్రీవారి క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు జరుపుకున్నారు. నేతలు మంతా శ్రీనివాసరావు, మటపర్తి బబ్జి, ఏపూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, సమైక్యతా భావం ఉండాలి

▸ కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

భీమవరం టౌన్/అత్తిలి, జూన్ 22 : విద్యార్థి దశ నుంచే దేశభక్తి,సమైక్యతా భావం ఉండాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం భీమవరంలోని ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బండా వీర్రాజు ప్రాథమిక పాఠశాల, ఏఆర్ కేఆర్ మున్సిపల్ హైస్కూల్, కేజీఆర్ఎల్‌లో ఇంటర్, డీఎన్నార్ లా చదివానని, స్కూల్లో ఎస్పీఎల్‌గా ఉన్నానని, జాతీయ సమైక్యత కార్యక్రమాలను నిర్వహించడం గొప్పవిశేషమని అన్నారు. మన భారతదేశం జాతీయ సమైక్యతతోనే నడుస్తుందని, దేశ ప్రధాని మోదీ స్ఫూర్తితో దేశాభివృద్ధికి సహకరించాలన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ చిన్నప్పటి నుంచి విద్యార్థి సంఘ నాయకునిగా విద్యార్థుల సమస్యలు తీర్చారన్నారు. ఇటువంటి జాతీయ సమైక్యత స్ఫూర్తితో విద్యార్థుల్లో చైతన్యం కలుగుతుందన్నారు. అనంతరం 400 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ పట్టణంలోని పలు వీధుల మీదుగా సాగింది. హైస్కూల్ హెచ్ఎం ఏవీ సత్యనారాయణ, నరహరిశెట్టి కృష్ణ, కొండ్రు శ్రీనివాస్, కాగిత సురేంద్ర, అరసవల్లి సుబ్రహ్మణ్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా శ్రీనివాసవర్మ చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగ్‌లను అందజేశారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర..

అత్తిలిలో హనుమాన్ శక్తి జాగరణ సమితి వారిచే శోభాయాత్ర శనివారం వైభవంగా నిర్వహించారు. తొలుత కోలాట భజనలు, తీన్‌మార్ డప్పులు, హనుమాన్ వేషధారణలు, చివరిగా బైక్ ర్యాలీని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, స్వామీజీలు శ్రీనివాసనంద సరస్వతి స్వామీజీ, శ్రీధర్ స్వామీజీలు, స్వరూపానంద స్వామీజీ ప్రారంభించారు. శోభాయాత్ర అత్తిలి డిగ్రీ కళాశాల నుంచి కాల్వగట్టు, గోపాలస్వామి గుడి వీధి, శివాలయం, తణుకు రోడ్డు మీదుగా వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు వైభవంగా నిర్వహించారు. హిందుత్వ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని శ్రీనివాసనంద సరస్వతి స్వామీజీ అన్నారు. అనంతరం ముక్కామల పీఠం స్వామీజీ, శ్రీధర్ స్వామీజీ మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ నాయకులు ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పాశ్చాత్య సంస్కృతికి లొంగక భారతీయ సంప్రదాయాలను గౌరవించాల న్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాల నృత్య కళాకారిణి తణుకుకు చెందిన హర్షిత నాగశ్రీ ప్రదర్శించిన నాట్య ప్రదర్శన ఆహూతులను అలరించింది.





భీమవరంలో జాతీయ సమైక్యత ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాసవర్మ

అత్తిలి హనుమాన్ శోభాయాత్రలో..

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

▸ వైద్యసిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

▸ పశ్చిమ గోదావరి జిల్లా డీఎంహెచ్‌వో మహేశ్వరరావు



పోడూరు పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

పోడూరు, జూన్ 22 : ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు ఆదేశించారు. శనివారం పోడూరు పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతున్నాయన్నారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకం కలిగేలా అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ప్రతీ నెలా కనీసం పది ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యసిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది రోగుల పట్ల బాధ్యతగా ఉండాలని, ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు, డయేరియా వంటివాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పీహెచ్‌సీలో రోజువారీ నిర్వహణ రికార్డులను పరిశీలించి, నిర్మాణంలో వున్న లేబొరేటరీ భవనాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీలో మూడు ఎంఎల్‌హెచ్‌సీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటిని భర్తీ చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీవాసవి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీవాసవి, ఏఎస్‌వో సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



నన్నయ ఆచార్యులకు రూస ప్రాజెక్టు పత్రాలను అందజేసిన వీసీ

8 మంది 'నన్నయ' ఆచార్యులకు రూస ప్రాజెక్టులు

రాజమహేంద్రవరం, జూన్ 22: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎనిమిది మంది ఆచార్యులకు రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షాఅభియాన్ (రూస) ద్వారా ప్రాజెక్టులు మంజూరయ్యాయని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో సంబంధితులకు ప్రాజెక్టు పత్రాలను శనివారం వీసీ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్శిటీ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలోని ఆంగ్ల విభాగానికి చెందిన ఆచార్య కె.శ్రీరమేష్, ఎస్.సజన్‌రాజ్‌లకు, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య కేవీ స్వామి, ఆచార్య డి.కళ్యాణి, కె.నూకరత్నం, ఎ.మట్టారెడ్డి, పి.విజయనిర్మలకు ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. రూస నిధులతో నిర్వహించే ఈ ప్రాజెక్టులను సమర్థవంతంగా పూర్తి చేసి కొత్తవిషయాలను సమాజానికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా కాన్షియస్ ట్రస్ట్‌తో 'నన్నయ' ఎంవోయూ

రాజమహేంద్రవరం, జూన్ 22: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, సెంటర్స్ ఆఫ్ యోగా కాన్షియస్ ట్రస్ట్(వైసీటీ) గోదావరి శాఖ కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా మధ్య అవగాహన ఒప్పందాన్ని తిరిగి ప్రారంభించామని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం ఎంఓయూ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సుధాకర్, శ్రీరాపర్తిరామ యోగా సంస్థ కార్యదర్శి ఎంవీజీఎస్ శర్మ ఎంవోయూలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వైసీటీ, నన్నయ వర్శిటీ మధ్య ఎంవోయూ తిరిగి ప్రారంభించామని, విద్య పరిశోధనలను ప్రోత్సహించడానికి సంయుక్తంగా పనిచేస్తామన్నారు. సంస్థ సహకారంతో పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సును అందిస్తున్నామని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ పాల్గొన్నారు.

'కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి'

పాలకొల్లు టౌన్, జూన్ 22: గత ప్రభుత్వ కాలంలో జరిగిన ఉద్యోగ, ఉపాధి నియామకాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కాపులకు ఇవ్వకపోవడంతో ఎంతో నష్టపోయామని మాజీ ఎంపీ, కాపుబలిజ సంక్షేమ సేన ఫౌండర్ ప్రెసిడెంట్ చేగొండి హరిరామ జోగయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నియామకాల్లో కాపులకు రిజర్వేషన్ సౌకర్యం అమలు జరపకపోతే మరింత నష్టపోతారన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపులకు అగ్రవర్ణాల పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటాలో ఐదు శాతం రిజర్వేషన్లు కలుగజేస్తూ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలులోకి తీసుకునిరాలేదన్నారు. దీన్ని కాపులపై జగన్ కక్షసాధింపు చర్యగా భావిస్తున్నామన్నారు.



శ్రీవారి దర్శనానికి క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న యాత్రికులు

శ్రీవారి క్షేత్రంలో భక్తులు కళకళ

ద్వారకాతిరుమల, జూన్ 22: భక్తుల గోవింద నామాలతో చిన్న తిరుమలేశుని క్షేత్రం మార్మోగింది. స్వామికి ఇష్టమైన రోజు కావడంతో శనివారం ఆలయానికి వచ్చిన యాత్రికులతో పరిసరాలు కళకళలాడాయి. ఆలయానికి దాదాపు 20 వేల మంది పైబడి భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీవారి దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలి



ద్వామా పీడీకి వినతిపత్రం సమర్పిస్తున్న సంతోష్ కుమార్

ఏలూరుటూటౌన్, జూన్ 22 : మహాత్మాగాంధీ ఉపాధి పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలని ఏపీ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఏలూరులో ద్వామా పీడీ పి.రాముకి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో కొంతమంది రాజకీయ నాయకుల అనుచరులు ఫీల్డ్ అసిస్టెంట్లను ఇబ్బంది పెడుతున్నారన్నారు. తగు విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్లకు రక్షణ కల్పించాలని కోరారు.

పాఠశాల విద్యాసామగ్రి గది సీజ్



గదిని సీజ్ చేసిన ఎంఈవో జ్యోతి

ఉండి, జూన్ 22: ఉండి గీతాంజిలి ప్రైవేటు స్కూల్‌లో విద్యాసామగ్రి విక్రయాలకు సంబంధించి అధికంగా నగదు వసూలు చేస్తున్నారనే విషయం తనదృష్టికి రావడంతో పాఠశాలకు వెళ్లి విద్యాసామగ్రి గదిని సీజ్ చేశామని ఎంఈవో జ్యోతి శనివారం తెలిపారు. విద్యాసామగ్రికి అధికంగా నగదు వసూలు చేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ విషయమై విద్యాశాఖ దృష్టికి తీసుకుని వెళ్లినా పట్టించుకోకపోవడంతో ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. స్పందించిన ఎంఈవో పాఠశాలకు వెళ్లి తనిఖీలు చేసి గదిని సీజ్ చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, గోవిందు, సాయి, వెంకట్, గణేష్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది అడుగుల నల్లతాచు హల్‌చల్



జంగారెడ్డిగూడెం, జూన్ 22 : జంగారెడ్డిగూడెం పట్టణ శివారు బైపాస్ రోడ్‌లోని ప్రకృతి నర్సరీ ఎదురుగా ఉన్న సీట్ కవర్ల షాపులోకి ఎనిమిది అడుగుల నల్లతాచు శనివారం హల్‌చల్ చేసింది. పాము రాకను గమనించిన షాపు యజమాని స్నేక్ సేవియర్ సొసైటీ సంస్థ నిర్వాహకుడు చదలవాడ క్రాంతికి సమాచారం అందించగా అక్కడకు చేరుకుని సురక్షితంగా పట్టుకున్నారు. ఆ పామును అడవిలో వదిలిపెడతామని ఆయన తెలిపారు.

టీటీడీకి కూరగాయల వితరణ

నూజివీడు టౌన్, జూన్ 22: టీటీడీలోని నిత్యాన్నదాన సత్రానికి నూజివీడుకు చెందిన పలువురు దాతలు కూరగాయలను అందించారు. నూజివీడు నుంచి ప్రతినెలా అన్నదాన సత్రానికి కూరగాయలు తరలిస్తుండగా, శనివారం సుమారు 14 టన్నుల కూరగాయలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక వాహనంలో తిరుమలకు పంపినట్టు దాత నక్కా సత్యనారాయణ తెలిపారు. దొండ, బెండ, సొర తదితర కూరగాయలను వెంగమాంబ అన్నదాన సత్రానికి తరలించినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విచారణ చేస్తారా..?

▸ న్యాయం జరగలేదు.. పరిహారం ఇవ్వలేదు

▸ ప్రైవేట్ లైన్‌మన్ మృతి చెంది ఏడు నెలలు

▸ బాధ్యుల్ని కాపాడుతున్న అధికారులు

▸ కేసులో అనుమానాలు అనేకం



షణ్ముకం (ఫైల్)

నరసాపురం, జూన్ 22: ప్రైవేట్ లైన్‌మన్ షణ్ముకం మృతి చెంది ఏడు నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు ఎవరిపై చర్యలు తీసుకోలేదు, విచారణే ముందుకు సాగడం లేదు. బాధ్యుల్ని ఈపీడీసీఎల్‌కు చెందిన ఇద్దరు కీలక అధికారులు కాపాడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఈ కేసులో ఇంతవరకు ఎవరిపై సస్పెండ్ వేటు పడలేదు, మృతుడి కుటుంబానికి ఇంతవరకు న్యాయం జరగలేదు, పరిహారం ఇవ్వలేదు. ఈ సంఘటన తరువాత జరిగిన కె.బేతపూడి, కొప్పర్రు ఘటనలో మృతి చెందిన ప్రైవేట్ లైన్‌మన్‌కు పరిహారం అందింది. బాధ్యులైన లైన్‌మన్‌ను సస్పెండ్ చేశారు. షణ్ముకం సంఘటన జరిగి నెలలు కావొస్తున్నా.. ఇంతవరకు బాధ్యులెవరనేది తేలలేదు.

చెన్నై నుంచి బతుకుతెరువు కోసం దాదాపు 30 ఏళ్ల క్రితం వచ్చిన షణ్ముకం అంటే నరసాపురం పట్టణంలో తెలియని వారు ఉండరు. అర్ధరాత్రిలో కరెంట్ పోయిందని ఫోన్ చేస్తే చాలు సత్వరమే వాలిపోయేవాడు. అతడి సేవల్ని ఈపీడీసీఎల్‌లో చాలామంది లైన్‌మన్‌లు వినియోగించుకోవడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా స్తంభాలెక్కని లైన్‌మన్‌లు షణ్ముకాన్ని పెట్టుకుని ఉద్యోగులుగా చలామణి అవుతున్నారు. ఇందుకు గాను అతడికి నెలకు కొంత మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే గత ఏడాది డిసెంబరులో పట్టణంలో పోల్‌పై పని చేస్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ముందుగా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు తరలించారు. అక్కడ వారం రోజులు చికిత్స పొంది మృతి చెందాడు. ప్రమాద విషయాన్ని ఈపీడీసీఎల్ అధికారులు బయటకు పొక్కనివ్వలేదు. అతడు మృతి చెందడంతో పోలీసులు కేసు కట్టారు. అప్పుడు విశాఖలోని ఈపీడీసీఎల్‌లోని అధికారులకు ఈ విషయాన్ని చేరవేశారే గాని, బాధ్యులెవ్వరనేది చెప్పలేదు, అప్పటి నుంచి డిపార్టుమెంటల్ విచారణ ముందుకు సాగడం లేదు. దీనికి కారణం ఈపీడీసీఎల్‌కు చెందిన ఇద్దరు ఉన్నదికారులే అనే వాదనలు ఆ శాఖ ఉద్యోగులే చెప్పుకోవడం గమనార్హం. మరోవైపు షణ్ముకం మృతిలో పోస్టుమార్టం, పోలీస్ రిపోర్టులు కీలకంగా మారాయి. కనీసం కొత్త ప్రభుత్వంలోనైనా బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందో లేదో చూడాలి.

క్రైం సమాచారం

వేర్వేరుచోట్ల నలుగురి మృతి

ఏలూరు జిల్లాలో శనివారం వేర్వేరు చోట్ల నలుగురు మృతి చెందారు. జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామానికి చెందిన రైతు కూలీ విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడ్డాడు. ఏలూరు సమీపంలో రైలు నుంచి జారిపడి ఒకరు.. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి గోదావరిలో స్నానానికి దిగి మృత్యువాత పడ్డాడు.

పొగాకు పనికి వెళ్తూ లారీ ఢీకొని యువకుడి మృతి

▸ మరొకరికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు



జంగారెడ్డిగూడెం, జూన్ 22 : ట్రాలీ లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు పెట్రోల్ బంకు వద్ద జరిగింది. జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబస్ తెలిపిన వివరాలివి.. లక్కవరం గ్రామానికి చెందిన 16 మంది కూలీలు పొగాకు పని నిమిత్తం తాడువాయి చల్లావారిగూడెం గ్రామాలకు ప్రతీరోజు వెళ్తారు. శనివారం కూడా పని నిమిత్తం 14 మంది ఆటో ఎక్కగా ప్రమాదం బారిన పడిన ఇద్దరూ ఆటోలో ఖాళీ లేక ద్విచక్ర వాహనంపై బయలు దేరగా మార్గమధ్యలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో చుండ్రు దేవరాజు (18) యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో వ్యక్తి బంటుమిల్లి నాగరాజు కాలు నుజ్జునుజ్జయింది. స్థానికులు గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. మృతుడు దేవరాజుకు తండ్రి వెంకన్న,తల్లి మేరీ, అన్న జాన్‌రాజు ఉన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఫెన్సింగ్‌లో విద్యుత్ ప్రవహిస్తోందని తెలియక..

▸ విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి

ఆగిరిపల్లి, జూన్ 22: వరి చేనుకు వేసిన ఫెన్సింగ్‌లో విద్యుత్ ప్రవహిస్తోందని తెలియక ఆ ఫెన్సింగ్ దాటబోయిన రైతు కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈదులగూడెం గ్రామానికి చెందిన పండిపోయిన నాగేశ్వరరావు (45) ఉదయం పొలం పనికి వెళ్ళి మధ్యాహ్నం 12 గంటలకు కూడా భోజనానికి రాకపోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్ళి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఫెన్సింగ్ దాటుతుండగా విద్యుదాఘాతానికి గురైనట్టు తెలిసింది. అతడితో పాటు సమీపాన మరో 12 కోతులు అదే ఫెన్సింగ్ తీగను పట్టుకుని విద్యుదాఘాతానికి గురై మరణించినట్లు కనిపించాయి.

రైలు నుంచి జారిపడి బెంగాల్ వాసి మృతి

ఏలూరు క్రైం, జూన్ 22 :వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు పశ్చిమ బెంగాల్ వాసి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరు సమీపంలోని వట్లూరు నెహ్రూ కాలనీ దగ్గరలో రైలు పట్టాలపై ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు శనివారం ఉదయం ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలను బట్టి పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర్ దినైపూర్‌కు చెందిన మంగల్‌ముర్ము(47) రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు భోగీ నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం కుటుంబ సభ్యులకు అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

గోదావరిలో స్నానానికి దిగి బాలుడి మృత్యువాత



కార్తీక్ (ఫైల్)

ఏలూరు క్రైం, జూన్ 22 : చిన్నప్పుడే అమ్మనాన్నలను కోల్పోయిన ఆ బాలుడిని పెద్దమ్మ ఆశ్రయం కల్పించి కన్నతల్లిలా పెంచిపోషిస్తూ చదివిస్తుంది. బంధువుల ఇంటి పెళ్లికి మేనమామతో పాటు భద్రాచలం వెళ్లి సమీపంలో గోదావరి నది ఉండడంతో అందరితో పాటు ఆ బాలుడు స్నానానికి దిగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనతో ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో విషాదం నెలకొంది. అంగులూరి కార్తీక్ (11) 8వ తరగతి చదువుతున్నాడు. తన మేనమామతో భద్రాచలంలోని బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి శనివారం వెళ్లాడు. అక్కడ అందరితోపాటు గోదావరిలో స్నానం చేయడానికి దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనతో బంధువులు తల్లడిల్లిపోయారు. మృతదేహం శనివారం రాత్రి ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి ఇందిరా కాలనీకి తీసుకురానున్నారు.

కుక్కునూరు పీహెచ్‌సీపై పిడుగుపాటు

▸ త్రుటిలో తప్పిన ప్రమాదం

కుక్కునూరు, జూన్ 22: కుక్కునూరు గ్రామంలోని పీహెచ్‌సీపై శుక్రవారం రాత్రి పిడుగుపడింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీగా వర్షం పడుతున్న సమయంలో పిడుగు పడింది. ఈ క్రమంలో స్లాబు కింద నుంచి పెచ్చూడి కిందపడింది. ఆ సమయంలో అక్కడ ఆయా, ఏఎన్ఎం విధులు నిర్వహిస్తున్నారు. పెచ్చు కిందరాలిపడిన సమయంలో ఆయా భుజానికి స్వల్పగాయమైంది. ఈ ఆసుపత్రి ముందు జెండా ఎగురవేయడానికి ఇనుప రాడ్లుతో కూడిన నిర్మాణం ఏర్పాటు చేశారు. దీని వల్లే పిడుగుపాటు జరిగి ఉండవచ్చని పలువురు చెబుతున్నారు.

పంట బోదెలోకి కారు బోల్తా



తాడేపల్లిగూడెం రూరల్, 22: తాడేపల్లిగూడెం మండలం పడాల అయ్యప్ప ఆలయం సమీపంలో పంట బోదెలో కారు పల్టీకొట్టిన ఘటన శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. నిడదవోలు నుంచి నలుగురు మైనర్ యువకులు ఏలూరు వైపు కారులో బయల్దేరగా అయ్యప్ప ఆలయం వద్దకు వచ్చే సరికి కారు అదుపుతప్పి పంట బోదెలోకి బోల్తా కొట్టింది. ఆ కారులో ఉన్న వారికి స్వల్పగాయాలతో బయట పడ్డారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.

పది మంది జూదరుల అరెస్ట్

జీలుగుమిల్లి/ముసునూరు, జూన్ 22: వేర్వేరు చోట్ల పేకాటాడుతున్న పది మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి గ్రామ శివారులో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం గ్రామ శివారులో పేకాటాడుతున్నట్టు సమాచారంతో సిబ్బందితో కలసి దాడి చేశామన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.50,050 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ముసునూరు మండలంలోని చింతలవల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. చింతలవల్లికి చెందిన కలపాల థామస్, సొంగా సురేష్, పులిపాక కుమార్, పల్లిపాము ఆంజనేయులు, ముసునూరుకు చెందిన కాట్రు నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.వాసు తెలిపారు.

సొమ్ము కట్టలేదని బెల్టుతో కొట్టిన వడ్డీ వ్యాపారి

ఏలూరు క్రైం, జూన్ 22 : వడ్డీ సొమ్ము కట్టడంలేదని ఇంటికి పిలిపించి బెల్టుతో ఒక వడ్డీ వ్యాపారి చితకబాదాడు. గాయాలతో ఉన్న బాధితుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రాగా ఎమ్మెల్సీగా నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడు ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు ఇచ్చిన వాఙ్మూలం ప్రకారం ఏలూరు ఆర్ఆర్‌పేటకు చెందిన కనకం వీరభద్రరావు ఫ్లెక్సీ షాపులో పనిచేస్తున్నాడు. 2020లో తన కుటుంబ అవసరాలు నిమిత్తం ఏలూరు చొదిమెళ్ల ఆర్టీవో ఆఫీస్ సమీపంలో నివాసం ఉంటున్న పెద్దిరెడ్డి ప్రదీప్ వద్ద లక్ష రూపాయలు అప్పు తీసుకుని ప్రతి నెలా ఆరు వేల రూపాయలు వడ్డీ కడుతున్నాడు. మూడు నెలల నుంచి వడ్డీ కట్టకపోవడంతో.. వడ్డీతోపాటు అసలు తీసుకుని ఇంటికి రావాలని సదరు వ్యాపారి కబురు పెట్టాడు. లేదంటే తనకు ఇచ్చిన ఖాళీ చెక్కులపై ఎక్కువ సొమ్ములు వేసి కేసులు వేస్తానని బెదిరించాడు. భయంతో శనివారం ఉదయం పెద్దిరెడ్డి ప్రదీప్ ఇంటికి వెళ్ళిన వీరభద్రరావును తోలు బెల్టుతో చావబాదాడు. ప్రదీప్ భార్య అడ్డుపడి ఆపడంతో అక్కడ నుంచి వీరభద్రరావు పారిపోయి ఇంటికి వెళ్ళిపోయాడు. తన భార్య అరుణ సాయంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్యులకు చెప్పడంతో ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్, జూన్ 22: అశోక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు నరికివేత, లైన్ల మరమ్మతులు చేసేందుకుగాను ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్, ఆర్‌ఆర్ పేట, గోసంరక్షణ వీధి, పవర్‌పేట గేటు, కొత్తపేట ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

నేడు 300 మందితో యోగా ప్రదర్శన

ఏలూరు టూ టౌన్, జూన్ 22: రామకోటి ప్రాంగణంలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి యోగా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏఎస్‌ఆర్ స్టేడియం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఎం అక్బర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్లాష్ టీమ్ ఆధ్వర్యంలో 300 మందితో యోగా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) హాజరవుతున్నారని తెలిపారు.

చెక్కులు అందజేసిన ఎస్పీ


దుర్గకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, జూన్ 22 : హోం గార్డుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. జిల్లా హోం గార్డు విభాగంలో పని చేస్తూ అనారోగ్యంతో గతేడాది జనవరి 15న మరణించిన హోంగార్డు ఎస్.దుర్గాప్రసాద్ (హెచ్‌జీ 916)కు హోంగార్డు సంక్షేమ నిధి నుంచి వచ్చిన రూ.5,41,040 చెక్కును మృతుని భార్య దుర్గకు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో అందించారు. ఏలూరు హోం గార్డు విభాగంలోనే పని చేసిన సీహెచ్ పుల్లారావు (హెచ్‌జీ 230) గతేడాది సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేశారు. ఆయనకు వచ్చిన రూ.5,43, 150ల చెక్కును ఎస్పీ అందజేశారు. ఏఆర్‌ఆర్‌ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలని డిమాండ్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 22 : ఏపీటీఎఫ్ ఏలూరు జోన్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సంఘ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ఆటంకంగా ఉన్న జీవో 117ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి(ఐఆర్)ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు రామారావు, కృష్ణారావు, కొండయ్య, ఆనంద్ కుమార్, ప్రకాష్, శ్రీనివాస్, శేషుకుమార్, బాలాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి స్వామి ఆదాయం రూ. 73 వేలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 22 : దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సత్రంపాడులోని శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయంలోని హుండీని శుక్రవారం లెక్కించగా 76 రోజులకు రూ.73,795 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. అర్చకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

జేష్ట పౌర్ణమి పూజలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 22 : జేష్ట శుద్ధ పౌర్ణమి సందర్భంగా శనివారం నగరంలోని పలు డివిజన్లలో గల శ్రీవారి ఆలయాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

● కామవరపుకోట : స్థానిక శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా పీఠంలో జేష్ట శుద్ధ పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు జరిపారు.

దోషులను కఠినంగా శిక్షించండి

ఏలూరు టూ టౌన్, జూన్ 22: చీరాల పోలీస్‌స్టేషన్ పరిధిలో సీతంపేటకు చెందిన సుచరిత మరణానికి కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు డిమాండ్ చేశారు. సీతంపేట రైల్వేపట్టాల పక్కన సుచరిత మృతదేహం నుంచి రక్తం కారుతుందన్నారు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు స్పందించి హోం మంత్రి అనితను ఘటన స్థలానికి పంపించడంపై హర్షం వ్యక్తం చేశారు. తక్షణమే మృతికి కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

లింగపాలెం, జూన్ 22: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో ఒరుదు రాంబాబు సూచించారు. లింగపాలెంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు బాగు చేయించాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎఫ్ చెల్లించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు టూ టౌన్, జూన్ 22 : ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌ను సకాలంలో చెల్లించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. ఇఫ్టూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొన్ని యాజమాన్యాలు పీఎఫ్ చెల్లించకుండా ఎగ్గొడుతున్నాయన్నారు. కంపెనీలు, పరిశ్రమల యాజమాన్యాలు సకాలంలో పీఎఫ్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయండి

పోలవరం, జూన్ 22 : విద్యార్థులకు అవసరమయ్యే అన్ని ధ్రువీకరణ పత్రాలు సోమవారానికి అందజేయాలని రెవెన్యూ సిబ్బందిని తహసీల్దారు జీవీ ప్రసాద్ శనివారం ఆదేశించారు. విద్యార్థులు కళాశాలల్లో చేరడానికి అవసరమయ్యే కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాల పంపిణీలో జాప్యం జరగడంతో వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు.

తాగునీటి పరీక్షలతో వ్యాధులు దూరం

జీలుగుమిల్లి, జూన్ 22 : రక్షిత మంచినీటి ట్యాంకుల్లో వచ్చే నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తుండడంతో పంచాయితీల్లో ఆయా మంచినీటి ట్యాంకుల వద్ద నీటి పరీక్షలు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వినయ్‌కుమార్ అన్నారు. పదిహేను రోజులకు ఒకసారి తాగునీటి క్లోరినేషన్ చేయటం వల్ల ప్రజల్ని రోగాల బరి నుంచి కాపాడవచ్చన్నారు. లేబ్ అసిస్టెంట్ కస్తూరి సిబ్బంది సుబ్రహ్మణ్యం ఉన్నారు.

120 మందికి వైద్య సేవలు

ఉంగుటూరు, జూన్ 22 : వెల్లమిల్లి పంచాయతీ ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉంగుటూరు, దెందులూరు ఆయుర్వేద ఆసుపత్రుల వైద్యాధికారులు కస్తూరి శిరీష, నగేష్ సుమారు 120 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్‌లకు శిక్షణ

ఏలూరు రూరల్, జూన్ 22: స్థానిక విద్యుత్ భవన్‌లో శనివారం ఏలూరు డివిజనల్ పరిధిలో ఉన్న ఎనర్జీ అసిస్టెంట్‌లకు వివిధ అంశాలపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు నార్త్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.పరింజిత సీపీఆర్ పై శిక్షణ అందించారు. ఫైర్‌సేఫ్టీపై అగ్నిమాపకాధికారి వి.రామకృష్ణ శిక్షణ ఇచ్చారు. ఎర్తింగ్, లైన్ క్లియరెన్స్, ఎల్‌సీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ, ఫైర్‌సేఫ్టీ తదితర అంశాలపై శిక్షణ అందించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గోపాలకృష్ణ, వీవీ కృష్ణంరాజు, ఎన్‌ఎస్‌వీ రఘుబాబు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

ఏలూరు క్రైం, జూన్ 22 : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మధుకుమార్ (పీసీ 2539) శనివారం మృతి చెందాడు. 2013 బ్యాచ్‌నకు చెందిన మధుకుమార్ రెండు నెలల క్రితం కాలేయ సమస్యతో ఆసుపత్రిలో చేరాడు. జిల్లా పోలీస్ అధికారుల సంఘం మధుకుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మధుకుమార్‌కు భార్య, ఎనిమిదేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఏలూరు క్రైం, జూన్ 22 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో జిల్లాలో ఉన్న పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమం నిర్వహించారు.

ఏరువాక సాగారో..

▸▸ కాడెద్దులకు, నాగలికి పూజలు ▸▸ ప్రారంభమైన సాగు పనులు


ఎండపల్లిలో పొలం దున్నుతున్న రైతు గోపాలకృష్ణ, దెందులూరులో ఏరువాక పూజలు చేస్తున్న అన్నదాతలు (ఇన్‌సెట్)

చింతలపూడి, జూన్ 22: ఎండపల్లిలో జేడీ ఫౌండేషన్ అబ్దుల్‌కలామ్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు పూజోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు మరికంటి గోపాలకృష్ణ, కాడెద్దులకు నాగలికి పసుపు, కుంకుమతో పూజలు చేశారు. వారు మాట్లాడుతూ వర్ష రుతువులో జేష్టశుద్ధ పౌర్ణమిని రైతులు ఏరువాక పౌర్ణమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఏరువాక అంటే నాగలి కట్టి భూమిని దున్నటం ప్రారంభించే కార్యక్రమం. దీంతో పొలం పనులు ప్రారంభించినట్లు అవుతాయన్నారు. రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా ఆహార ధాన్యాలను పండించాలని, ప్రకృతి సేద్యంవైపు పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమం రైతుల ఇంట ఒక పండుగ లాంటిదన్నారు. మూడు మండలాలకు చెందిన 20 మంది రైతులను సన్మానించి, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి డీపీఎం తాతారావు, మెహబూబ్‌వలీ, రైతులు పాల్గొన్నారు.

● దెందులూరు : రైతు భూమిని నాగలితో దున్నినప్పుడు భూదేవికి కోపం రాకుండా ఉండేందుందుకు రైతులు జేష్ట పౌర్ణమి ముహర్తంగా గణపతి పూజ చేసి సకల దేవతలు వరుణదేవుడు, తదితర దేవుళ్లకు పూజలు చేసి ఏరువాక పనులు ప్రారంభించారు. దెందులూరులో పలువురు రైతులు ఎద్దులతో నాగలి కట్టి పొలం దున్ని ఏరువాక నిర్వహించారు.

యంత్రాలు సాగుకే వినియోగించాలి


చింతలపూడి అధికారులతో మాట్లాడుతున్న ఏవో హబీబ్‌భాష

చింతలపూడి/టి.నరసాపురం, జూన్ 22: ప్రభుత్వం రైతులకు రాయితీపై ఇచ్చే ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు వ్యవసాయ పనులకే వినియోగించాలని, అధికారులు వీటిపై ఆయా మండలాల్లో పర్యవేక్షణ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌కే హబీబ్ భాష స్పష్టం చేశారు. చింతలపూడి సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల్లో ఉన్న కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా రాయితీపై ఇచ్చే ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు రైతులకు అందుబాటులో ఉన్నాయో లేదోనని శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చింతలపూడిలో మాట్లాడుతూ ఖాళీ సమయాల్లో అదే గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ధరకి అద్దెకివ్వాలన్నారు. చింతలపూడి సహాయ సంచాలకులు జి.నాగకుమార్, వ్యవసాయాధికారులు కె.మీనాకుమారి, మురళీకృష్ణ, సీహెచ్ పవన్‌కుమార్, బి.సుమలత, వీఏఏలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు టూ టౌన్, జూన్ 22: జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. అన్నే భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటకు పెట్టుబడులు లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు వేంటనే విడుదల చేయాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. కొబ్బరి, ఆయిల్ పామ్, నిమ్మ, అరటి, పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని రుణాలు అందించాలని అన్నారు. సహాయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాలపై అవగాహన


ఏలూరులో ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 22 : మలేరియా బారిన పడకుండా విద్యార్థులు జ్వరాలపై అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. నగరంలోని అశోక్‌నగర్ కేపీడీటీ హైస్కూలులో శనివారం నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని కోరారు. వైద్య సిబ్బంది నాగరంగమ్మ, శ్రీనివాసరావు, రమేష్, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : ప్రభుత్వ హాస్టళ్లలో దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సబ్ డివిజన్ మలేరియా అధికారి ఎస్‌ఏ ప్రసాద్ తెలిపారు. నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాలలో దోమల నివారణ మందు చల్లే కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ యూనిట్ పరిధిలో 16 ప్రభుత్వ వసతి గృహాలలో మందును పిచికారీ చేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ ఎం.బ్రాహ్మణేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ జఫ్‌రిల్లా, శ్రీనివాసరావు, వి.విజయనిర్మల, పారా మెడికల్ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందర్నీ బడిలో చేర్చటమే లక్ష్యం


ర్యాలీలో పాల్గొన్న డీఈవో అబ్రహం

ఏలూరు రూరల్, జూన్ 22: పిల్లలు అందర్ని బడిలో చేర్చటమే 'నేను బడికిపోతా' ర్యాలీ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం అన్నారు. శనివారపుపేట జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం బడికిపోతా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించటం జరుగుతుందన్నారు. అనంతరం బడిలో చేరిన పిల్లలకు స్టూడెంట్ కిట్స్, ఇతర విద్యా ప్రోత్సాహకాలు అందజేశారు. ఎస్‌ఎస్‌ఏ ఏపీఎస్ సోమశేఖర్, ఎంఈవో-2 రంగయ్య, కార్మిక శాఖ అధికారి నాగేశ్వరరావు, ఏఎల్‌ఎస్ రాధాకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం రవిప్రకాష్, ఉపాధ్యాయులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రగతికి ఎన్‌రోల్‌మెంటే ముఖ్యం

ఏలూరు రూరల్, జూన్ 22 : ఏలూరు రూరల్, అర్బన్, మండల ప్రధానోపాధ్యాయుల సమావేశం శనివారం మధ్యాహ్నం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు ఆర్.రవిప్రకాష్, ఆర్.రంగయ్య పాల్గొని 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పలు అంశాలను వివరించారు. పాఠశాలలు, ప్రగతి సాధించాలంటే ఎన్‌రోల్‌మెంట్ పై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టి విద్యార్థులు బడిలో ఉండేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. ఇప్పటికే పాఠశాలకు చేరుకున్న విద్యా కిట్లను విద్యార్థులకు అందించాలని సూచించారు.

ఉపాధి పనుల నిలిపివేత తగదు

ఏలూరు కలెక్టరేట్, జూన్ 22: దెందులూరు, పెదవేగి మండలాల్లో ఉపాధి హామీ పనులు నిలిపి వేయడంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా డ్వామా అధికారులపై మండిపడ్డారు. డ్వామా కార్యాలయంలో ఉపాధి కూలీలు, సంఘం ఆధ్వర్యంలో శనివారం డ్వామా పీడీ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న జీలుగుమిల్లి, ద్వారకాతిరుమల ఏపీవోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని డ్వామా పీడీ హామీ ఇచ్చారని రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, సహాయ కార్యదర్శి రాజమండ్రి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం ఉండకూడదు

పీడీ పద్మావతి


అంగన్‌వాడీలో భోజనాన్ని పరిశీలిస్తున్న పీడీ పద్మావతి

పెదవేగి, జూన్ 22 : పోషకాహార లోపం కారణంగా మాత, శిశు మరణాలు సంభవించకూడదని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ పీవీఎల్ పద్మావతి అన్నారు. మాత, శిశు మరణాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కృషి చేస్తోందన్నారు. పెదవేగిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం తనిఖీ చేసిన పీడీ, చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపం కారణంగా ఏ ఒక్కరి మరణం సంభవించకూడదన్న ధ్యేయంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార సరుకులను అందిస్తుందన్నారు. పిల్లల బరువు, ఎత్తును తరచుగా పరిశీలిస్తూ, బలహీనంగా ఉన్న చిన్నారులకు అదనపు ఆహారాన్ని అందించాలని ఆమె సూచించారు. క్రమం తప్పకుండా మెనూలో సూచించిన విధంగా ఆహారాన్ని అందించాలని, పిల్లల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా కృషి చేయాలని ఆమె సూచించారు. ఎప్పటికప్పుడు రికార్డుల నవీకరణ చేయాలని, పెరటి తోట పెంపకాన్ని ఖచ్చితంగా చేపట్టాలని ఆమె చెప్పారు. సీడీపీవోలు కె.విజయలక్ష్మి, ఎంఎస్ రాజశేఖర్, ఏవో వి.మల్లిక, సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, అనూరాధ, మల్లిక పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్‌ల రవాణా ఖర్చులు ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం,జూన్22 : స్టూడెంట్ కిట్ల రవాణా ఖర్చులు మండలానికి రూ.77 వేలు చొప్పున చెల్లించవలసి ఉందని, ఆ మొత్తాన్ని ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఖాతాల్లో జమ చేయాలని మండల విద్యాశాఖాధికారి జి.రాములుకు శనివారం యూటీఎఫ్ మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. స్టూడెంట్ కిట్‌లను మండల స్టాక్ పాయింట్ల నుంచి ఆయా పాఠశాలలకు పలు ప్రైవేటు వాహనాలలో తరలించేందుకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.11లు చొప్పున రవాణా ఖర్చులు అందజేస్తుందన్నారు. ఇప్పటి వరకు వచ్చిన కిట్‌లకు రవాణా ఖర్చులను హెచ్‌ఎంలే చెల్లించారని జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంపీ శ్యాంబాబు తెలిపారు. నాయకులు ఎంఏ నబీ, తడహికో, టి.రామకృష్ణ, ఏసురత్నం, ప్రసాద్ ఉన్నారు.

బాలల హక్కుల పై సమీక్ష

ఏలూరు కలెక్టరేట్, జూన్ 22: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా బాలల సంరక్షణ యూనిట్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి అధ్యక్షత వహించారు. ఇప్పటివరకు బాలల సంరక్షణ చేసిన కార్యక్రమాలు అందిస్తున్న సేవలు, తీసుకునే చర్యలను వివరించారు. ముఖ్య అతిథిగా బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలల సమస్యల పరిష్కారంలో అధికారులతో సమన్వయ పరుచుకోవాలని తెలిపారు. ఇబ్బందికరమైన పరిస్థితులుంటే కమిషన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. డిస్ట్రిక్ ప్రొహిబిషన్ అధికారి, చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్స్ నోడల్ అధికారి దుర్గాప్రసాద్, చైల్డ్, హెల్ప్ లైన్ శిశు గృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లింగయ్య చెరువు వద్ద ఆక్రమణల తొలగింపు

ద్వారకాతిరుమల, జూన్ 22: ద్వారకాతిరుమల లింగయ్యచెరువు చుట్టూ ఉన్న పలు ఆక్రమణలను స్థానిక పంచాయతీ అధికారులు శనివారం తొలగించారు. పంచాయతీకి ఏ విధమైన ఆదాయం ఇవ్వకుండా వారంతా పలు శాశ్వత షెడ్లను నిర్మించుకున్నారు. ఇవి దేవాలయానికి భక్తులు వెళ్లి వచ్చే దారిలో ఉండడం వల్ల వీటికి గిరాకీ ఎక్కువగా ఉంటుంది. వీరెవరూ పంచాయతీకి నగదు చెల్లించకుండా ఆక్రమించుకుని కదలక పోవడంతో పంచాయతీ జూలుం విదిలించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తీయాల్సిందే అని ఈవో ఎల్.వెంకటేశ్వరరావు, సిబ్బంది ఇ.రామారావు, తదితరులు ఆక్రమణలను తొలగించారు. వీరికి ఉపాధి పోకుండా తామే షాపులను ఏర్పాటు చేసుకునే వీలుకల్పిస్తామని అయితే పంచాయతీకి నెలవారీ అద్దె చెల్లించాల్సి ఉంటుందని కార్యదర్శి తెలిపారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ


కుక్కునూరు, పాతూరులో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం, జూన్ 22 : అక్కంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్లను శనివారం టీడీపీ మండల ఎస్సీ సెల్ నాయకుడు గొల్లమండల శ్రీనివాస రావు పంపిణీ చేశారు. హెచ్‌ఎం రాంబాబు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు పగడాల గంగారావు, మాజీ సర్పంచ్ గంధం గోపాలకృష్ణ, టీడీపీ, జనసేన నాయకులు మల్లాబత్తుల నరసింహస్వామి, టి.రామకృష్ణ,టి.నాగ ప్రసాద్, పారేపల్లి గంగారాం, కాజా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. మైసన్నగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ హైమావతి హాజరుకాగా, టీడీపీ నాయకులు నూనె పల్లారావు, విద్యా కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్.సత్యవాణి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

● టి.నరసాపురం : బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజుతో కలిసి మాజీ ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు తోట శ్యామల, గండబోయిన శ్రీను, కాళ్ళీడి రాంబాబు, కంపసాటి రమేష్, ఇమామ్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : పట్టణంలోని మేడబడిలో పాఠశాల విద్యార్థులకు కూటమి నాయకులు, కార్యకర్తలు బడికిపోదాం కార్యక్రమంలో పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. అనిష్ కుమార్, శేషగిరి, పక్కాల వెంకటేశ్వరరావు, మధుబాబు పాల్గొన్నారు.

● కుక్కునూరు : మండలంలోని 10 పాఠశాలల విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన హెచ్‌ఆర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన హేమంత రాజు, ప్రవీణ్‌కుమార్ల సహకారంతో ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ గిరిబగవాన్‌దాస్, తొండిపాక పంచాయతీ కార్యదర్శి గౌరీప్రియ, హెచ్‌ఎం రాధ, గౌరీ, సరస్వతి, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి : గార్లమడుగు హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాలతోపాటు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమకూర్చిన నోటు పుస్తకాలను అందజేశారు. టీడీపీ నాయకులు కొల్లి సత్యనారాయణచౌదరి మూతినేని గణేష్, మేడికొండ సీతారామదాసు, ముప్పాళ్ళ నాగయ్య తదితరులు పాల్గొన్నారు. కొప్పులవారిగూడెంలో జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తనగాల శ్యామ్‌బాబు, పవన్, వెంకటరమణ, చిన్న రాములు పాల్గొన్నారు.

● భీమడోలు : పాతూరు ప్రాథమిక పాఠశాలకు దాతల సహకారంతో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక ఎంపీపీ స్కూలులో హెచ్‌ఎం నిర్మలా కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రూ.15 వేలవిలువైన ఆఫీసు టేబుల్స్ కుర్చీలు అందజేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంఈవో శ్రీనివాసరావు, మానవతా ప్రతినిధులు సత్యనారాయణ, ఉమామహేశ్వరారావు, గంగాధరరావు, సాంబశివరావు, వెజ్జు ధర్మారావు, రాంబాబు, మండే సుధాకర్ పాల్గొన్నారు.

బాలకృష్ణతో మురళీ భేటి



కామవరపుకోట, జూన్ 22 : శాసనసభ సమావేశాలు జరుగు తున్న నేపథ్యంలో శని వారం అసెంబ్లీలో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామ కృష్ణ హిందూ పురం ఎమ్మెల్యే సినీ నటుడు నందమూరి బాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలుసుకుని కొద్దిసేపు వివిధ రాజకీయ విశ్లేషణలు జరిపినట్టు సమాచారం. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని కూటమిని గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారికి ఎమ్మెల్యే ధర్మరాజు పూజలు


శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే పత్సమట్ల

ద్వారకాతిరుమల, జూన్ 22: చినవెంకన్న ఆలయాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శనివారం సాయంత్రం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని పలికారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే ప్రభాకర్



పెదవేగి, జూన్ 22 : వైసీపీ పాలనలో రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ గాడి తప్పిందని, దీనికి క్షేత్ర స్థాయి నుంచి ప్రక్షాళన చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, డీజీపీ ద్వారకాతిరుమలరావుకు విన్నవించారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ద్వారకాతిరుమలరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు.

స్పీకర్‌ని కలిసిన నేతలు



భీమడోలు, జూన్ 22 : మండలానికి చెందిన ఐటీడీపీ సభ్యులు విజయవాడ హోటల్‌లో బస చేస్తున్న అయ్యన్న పాత్రుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అయ్యపాత్రుడుతో పాటు ఆయన కుమారుడు, ఐటీడీపీ సభ్యులు కలిశారు. ఉండవల్లి బాలానందం తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం : నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడిని పోలవరం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ శనివారం కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో మాట్లాడినట్లు శ్రీనివాస్ తెలిపారు.

సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయి


సీనియర్ నాయకుడిని సన్మానిస్తున్న కూటమి శ్రేణులు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 22 : సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. పవరుపేటలోని జనసేన కార్యాలయం వద్ద శనివారం నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దశలవారీగా పథకాలు అమలవుతాయని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా సంక్షేమ పథకాల ప్రస్తావన, పోలవరం, అమరావతి నిర్మాణాలు విషయాలపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఆయన వెంట నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, రెడ్డి గౌరీశంకర్, వీరంకి పండు, తదితరులు ఉన్నారు.

రాష్ట్రం స్వర్ణయుగం అవుతుంది

లింగపాలెం, జూన్ 22 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో స్వర్ణయుగం ప్రారంభమైందని మండల పార్టీ అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు అన్నారు. లింగపాలెంలో టీడీపీ కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో సీనియర్ నాయకులు మొరంపూడి రంగారావును సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు. మొరంపూడి మల్లిఖార్జున్‌రావు, తాతిన రాధాకృష్ణ, అసిలేటి అజయ్,శౌరి, మేడూరి జయరాజు, షేక్ సుభాని, పంతం ప్రసాద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

కామవరపుకోట, జూన్ 22 : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ వంటిపల్లి విజయకృష్ణ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తానని విజయకృష్ణ తెలిపారు.

కోండ్రుకోటలో ఎంపీడీఓ తనిఖీలు

పోలవరం, జూన్ 22 : కోండ్రుకోట సచివాలయం, పంచాయతీ కార్యాలయాలను శనివారం పోలవరం ఎంపీడీఓ జి.శ్రీను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం, సచివాలయం సిబ్బంది హాజరు, పనితీరు, రికార్డుల నిర్వహణ పనితీరు పరిశీలించారు. పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని సిబ్బందికి సూచించారు.

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

ద్వారకాతిరుమల, జూన్ 22: గ్రామంలోని మంచి నీటి బోరు శంకుస్థాపన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారని కొంతమంది వైసీపీ నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శిలాఫలకంపై ఉన్న మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఫోటోలను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళ పగులకొట్టారని ఫిర్యాదు చేశారు.

బిక్కు బిక్కుమంటూ సేవలు..



రమణక్కపేటలో కూలేందుకు సిద్ధంగా పశువైద్యశాల

పెచ్చులూడుతున్న స్లాబు.. బీటలు వారిన గోడలు

శిథిలావస్థలో పశువైద్యశాలలు

ఐదేళ్లుగా విన్నవిస్తున్నా చర్యలు లేవంటున్న రైతులు



ముసునూరులో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

ముసునూరు మండలంలోని పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. ముసునూరు పశువైద్యశాల భవనం స్లాబు నుంచి పెచ్చులూడి పడుతుండటంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. గోడలు బీటలు వారి అచ్చులుగా పడిపోతున్నాయి. కొద్దిపాటి వర్షానికే స్లాబు నుంచి నీరు గదుల్లోకి చేరుతోందని, మందులు, రికార్డులు, వ్యాక్సిన్, గడ్డి విత్తనాలు తదితర వాటిని భద్రపరుచుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వైద్య సిబ్బంది వాపోతున్నారు.

(ముసునూరు)

రమణక్కపేట, గోపవరం గ్రామాల్లో ఉన్న పశువైద్యశాల భవనాలు కూడా పూర్తిగా శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనాల్లో విధులు నిర్వహించటం సిబ్బందికి ప్రాణసంకటంగా మారింది. వైద్య సామగ్రిని అద్దె గదుల్లో భద్రపరుచుకుంటున్నారు. పశువులను వైద్యం కోసం తీసుకువచ్చే రైతులు సైతం వర్షం కురిస్తే భవనాల్లో నిలబడేందుకు భయపడాల్సి వస్తోందని వాపోతున్నారు. మండల వ్యాప్తంగా పశువులకు అత్యవసర చికిత్స ముసునూరు వైద్యశాల లోనే చేయాల్సి ఉందని, ఆసుపత్రి భవనం ప్రమాద స్థితిలో ఉన్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని, పాడి రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే రమణక్కపేట, గోపవరం గ్రామాల్లో పశువైద్యశాలల గురించి పట్టించుకున్న నాథుడే లేడు. శిథిలావస్థకు చేరిన వైద్యశాలల భవనాలను తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని ఐదేళ్ల నుంచి ఉన్నతాధికారులకు అర్జీలు అందించినా అవి నిరుపయోగంగానే మారాయని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ముసునూరు, రమణక్కపేట, గోపవరం గ్రామాల పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. ఈ భవనాల్లో విధులు నిర్వర్తించాలంటే సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. నూతన భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఐదేళ్లుగా ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం. నూతన ప్రభుత్వం అయినా నిధులు మంజూరు చేస్తే నూతన భవనాల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

- ఎం.వెంకటచైతన్య, పశువైద్యాధికారి, ముసునూరు

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే కామినేని



కైకలూరు, జూన్ 22: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం అమరావతిలో డీజీపీ కార్యాలయంలో ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు రాష్ట్రంలో విధ్వంస పాలన జరిగిందని పోలీసు వ్యవస్థను పూర్తిగా గాడిలో పెట్టాలని డీజీపీని కోరినట్లు తెలిపారు.

పురందేశ్వరికి నూజివీడు వీణ బహూకరణ



నూజివీడు టౌన్, జూన్ 22: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి నూజివీడులోని వీణల తయారీ దారు షేక్ మాబు వీణను బహూకరించారు. విజయవాడలో పురందేశ్వరిని కలిసిన మాబు తాను స్వయంగా తయారు చేసిన అతి చిన్న వీణను బహూకరించారు. ఈ సందర్భంగా నూజివీడులోని వీణల తయారీ కేంద్రాన్ని సందర్శించి కళలకు ప్రోత్సాహం కల్పించాలని పురందేశ్వరిని కోరినట్టు మాబు తెలిపారు.

పల్లాను కలిసిన తెలుగు తమ్ముళ్లు



నూజివీడు టౌన్, జూన్ 22: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను నూజివీడు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు శనివారం కలిశారు. నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యనమదల శ్రీనివాసరావు, కృష్ణమోహన్, బెజవాడ శ్రీనివాసరావు, పర్వతనేని దుర్గాప్రసాద్, యనమదల రమేష్ తదితరులు శ్రీనివాస్‌ను కలిసి తమ అభినందనలు తెలిపారు. పార్టీ విజయంతోనే టీడీపీ కార్యకర్తల పని అయిపోలేదని, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేయాలని ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ సూచించినట్టు నాయకులు తెలిపారు.

పరిశోధనకు 'రూసా' నిధులు



ప్రొఫెసర్ విజయ కుమార్

కైకలూరు, జూన్ 22: మత్స్య ఉత్పత్తుల్లో నిక్షిప్తమైన భారీ ఖనిజ అవశేషాలు-మానవజాతి ఆరోగ్యంపై అవి చూపే దుష్ప్రభావాలపై పరిశోధనకు కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుజాత తెలిపారు. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూసా) మత్స్య ఉత్పత్తుల పరిశోధన కోసం రూ.5 లక్షల నిధులు మంజూరు కావడం పట్ల కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం. విజయకుమార్‌కు అభినందనలు తెలిపారు. మత్స్య ఉత్పత్తులలో నిక్షిప్తమైన ఖనిజ అవశేషాలను కనుగునేందుకు ఆయన చేస్తున్న పరిశోధనలకు కేంద్రప్రభుత్వ సంస్థ రూసా నిధులను మంజూరు చేసిందన్నారు. మత్స్య ఉత్పత్తులపై పరిశోధనలు చేయాలని అధ్యాపకుడు తలచారని 2020 డిసెంబర్‌లో ఏలూరు పరిసర ప్రాంతాల్లో వందలాది మంది ప్రజలు అంతుచిక్కని వ్యాధికి గురయ్యారన్నారు. వారి రక్తనమూనాలు పరిశీలించగా ఎటువంటి వైరస్, సూక్ష్మజీవులు కనిపించలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏలూరు పరిసర ప్రాంతాల్లో ప్రజలు వాడే పాలు, నీరు, కూరగాయల్లో భారీ ఖనిజ అవశేషాలు నిక్షిప్తమైనట్లు గుర్తించారన్నారు. దీని ఆధారంగా అధ్యాపకుడు ఏలూరు పరిసర ప్రాంతాల్లో లభించే చేపల ఉత్పత్తుల్లో ఎంత శాతం ఖనిజ అవశేషాలు ఉన్నాయో, అవి ఏ మేరకు మానవుని ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతాయి అనే అంశంపై పరిశోధనలు ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం విజయకుమార్‌ను అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్పీ సూర్య చక్ర

ఉపాధి తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలి

ముదినేపల్లి, జూన్ 22 : మండలంలో గత ఏడాది జరిగిన ఉపాధి పనుల గ్రామ స్థాయి సామాజిక తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధి స్టేట్ రిసోర్స్ పర్సన్ సూర్య చక్ర తెలిపారు. మండలంలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనుల తనిఖీల నిర్వహణపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో ఎటువంటి పొరపాట్లు జరగ కూడదన్నారు. మండలంలో గ్రామస్థాయి ఉపాధి పనుల సామాజిక తనిఖీలు సోమవారం ప్రారంభమవుతాయని మండల ఉపాధి ఏపీవో నాగరాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణ బాబు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతకు సత్కారం

ముదినేపల్లి, జూన్ 22 : కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన విజయం సాధించేందుకు కృషి చేసినందుకు టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్‌ను శనివారం పలు గ్రామాల టీడీపీ నాయకులు సత్కరించారు. ముదినేపల్లిలోని ఎన్‌డీఏ కార్యాలయంలో ముదినేపల్లి, నందిగామ లంక, పెరికిగూడెం గ్రామాల టీడీపీ నాయకులు వినోద్‌ను సత్కరించారు.

ఉచిత సిలిండర్లు ఇస్తున్నారంటూ పుకార్లు

ఆగిరిపల్లి, జూన్ 22: ఉచిత సిలిండర్లు ఇస్తున్నారన్న పుకార్లతో ఆగిరిపల్లి భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ డీలర్ వద్దకు మహిళలకు పోటెత్తారు. కేంద్రం ఆదేశాలతో సాధారణ బయోమెట్రిక్ విధానాలకు పాత కస్టమర్లను అనుసంధానిస్తున్న నేపథ్యంలో ఆ విషయం తెలియని పలువురు కొత్త పథకానికి పేర్లు నమోదు చేస్తున్నారని పెద్ద ఎత్తున మహిళలు గ్యాస్ కంపెనీకి వచ్చారు. ప్రభుత్వం ఇంకా మూడు ఉచిత సిలిండర్లపై విధివిధానాలు రూపొందించలేదని శ్రీనివాస్ తెలిపారు.

పీఎఫ్ చెల్లించకుంటే చర్యలు చేపట్టాలి

ఏలూరు టూ టౌన్, జూన్ 22 : ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌ను సకాలంలో చెల్లించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. ఇఫ్టూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొన్ని యాజమాన్యాలు పీఎఫ్ చెల్లించకుండా ఎగ్గొడుతున్నాయన్నారు. కంపెనీలు, పరిశ్రమల యాజమాన్యాలు సకాలంలో పీఎఫ్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

క్రైం సమాచారం

ఫెన్సింగ్‌లో విద్యుత్ ప్రవహిస్తోందని తెలియక..

ఆగిరిపల్లి, జూన్ 22: వరి చేనుకు వేసిన ఫెన్సింగ్‌లో విద్యుత్ ప్రవహిస్తోందని తెలియక ఆ ఫెన్సింగ్ దాటబోయిన రైతు కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈదులగూడెం గ్రామానికి చెందిన పండిపోయిన నాగేశ్వరరావు (45) ఉదయం 7 గంటలకు పొలం పనికి వెళ్ళి మధ్యాహ్నం 12 గంటలకు కూడా భోజనానికి రాక పోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్ళి చూడగా అప్పటికే నాగేశ్వరరావు మృతి చెంది ఉన్నాడు. ఫెన్సింగ్ దాటుతుండగా విద్యుదాఘాతానికి గురైనట్టు తెలిసింది. ఇతనితో పాటు సమీపాన మరో 12 కోతులు అదే ఫెన్సింగ్ తీగను పట్టుకుని విద్యుదాఘాతానికి గురై మరణించినట్లు కనిపించాయి.

పేకాట శిబిరంపై దాడి.. ఐదుగురి అరెస్ట్

ముసునూరు, జూన్ 22: మండలంలోని చింతలవల్లిలో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. చింతలవల్లికి చెందిన కలపాల థామస్, సొంగా సురేష్, పులిపాక కుమార్, పల్లిపాము ఆంజనేయులు, ముసునూరుకు చెందిన కాట్రు నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వాసు తెలిపారు.

పరివర్తనతోనే కొత్త జీవితం



సబ్ జైల్లో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయాధికారి శివపార్వతి

నూజివీడు, జూన్ 22: ఖైదీల్లో పరివర్తనతోనే నూతన జీవితాన్ని పొందవచ్చని, నూజివీడు రెండో అదనపు సివిల్ న్యాయాధికారి కె.శివపార్వతి అన్నారు. శనివారం నూజివీడు సబ్‌జైల్‌ను ఆమె సందర్శించి ముద్దాయిలతో ఆమె మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పులతో అనేక మంది జైలు జీవితాన్ని అనుభవిస్తున్నారని, దీనిని గుణపాఠంగా నేర్చుకుని పరివర్తనతో నూతన జీవితాన్ని పొందాలన్నారు. అనంతరం చట్టప్రకారం ఖైదీలకు అందిస్తున్న సేవలను, భోజన సదుపాయాలను పరిశీలించారు. ఆర్థిక స్తోమత లేక న్యాయవాదులను నియమించుకోలేని ఖైదీలకు వారి తరఫున వాదించటానికి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయవాదులను నియమిస్తామని తెలిపారు. జైల్ సూపరింటెండెంట్ జి.ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి లబ్ధిదారుల గుర్తింపు



ఉపకరణాల కోసం రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్న దృశ్యం

నూజివీడు టౌన్, జూన్ 22: ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ఉచిత ఉపకరణాలను పంపిణీ చేస్తోందని, వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ బి.సోమశేఖర్ అన్నారు. నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నూజివీడు నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల్లో 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు ఉచిత ఉపకరణాల మంజూరుకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 35 మంది మానసిక దివ్యాంగులు, 43 మంది అంగవైకల్యం కలవారు, 37 మంది వినికిడి సమస్య ఉన్నవారు, 20 మంది అంధులను గుర్తించటం జరిగింది. మొత్తం 270 రిజిస్ట్రేషన్‌లను నిర్వహించారు. సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ భాస్కరరావు, నూజివీడు మండల విద్యాశాఖ అధికారులు సేవ్యా నాయక్, జమలయ్య, నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ఐఈఆర్టీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ వద్ద భోజనాల వితరణ

కైకలూరు, జూన్ 22: పేదవాడికి పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను మూసివేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. శనివారం కైకలూరు అన్నక్యాంటీన్ వద్ద మునగాల పృథ్వి ఆర్థిక సాయంతో 500 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నేతలు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ఉపయోగపడే ప్రతి పథకాన్ని జగన్ నిర్వీర్యం చేశారన్నారు. ప్రభుత్వం అన్నక్యాంటీన్ల నిర్వహణ చేపట్టేవరకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రతి రోజు అన్నక్యాంటీన్ నిర్వహిస్తామన్నారు. టీడీపీ నాయకుడు బీకేఎం నాని, జనసేన నాయకులు పెరుగు నాగరాజు, తోట లక్ష్మీ, మునగాల రమేష్, ఎంపీటీసీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్వరాలతో వణుకుతున్న చొప్పరమెట్ల

పరీక్షల కోసం ల్యాబ్‌కు నీటి నమూనాలు

ఆగిరిపల్లి, జూన్ 22: వారం రోజులుగా చొప్పరమెట్ల గ్రామస్థులు తీవ్ర జ్వరాలతో బాధపడుతూ సగ్గూరు పీహెచ్‌సీ బాట పట్టారు. మూడు రోజుల క్రితం వాటర్ శాంపిల్ ఏలూరు ల్యాబ్‌కు పంపారు. శుక్రవారం గ్రామంలో ఫాగింగ్ కూడా జరిపారు. అయినా జ్వరాలు అదుపులోకి రాకపోవడంతో రెండోసారి వాటర్ శాంపిల్స్ పంపే ప్రయత్నంలో ఉన్నామని పీహెచ్‌సీ డాక్టర్ మంజుల దేవి తెలిపారు.

తాగునీటి వంతు ఇవ్వాలి

కలిదిండి, జూన్ 22: లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులకు తాగునీటి వంతు ఇవ్వాలని మూల్లంక, పెదలంక, మట్టగుంట గ్రామాల సర్పంచ్‌లు మహదేవ విజయ్, మోకా లక్ష్మీ రామకృష్ణ, అంద్రాజు రత్నమణి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చెరువుల్లో నీరు రంగు మారి దుర్వాసనతో తాగటానికి పనికిరాక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. వారం రోజుల్లో చెరువుల్లో నీరు పూర్తిగా అడుగంటే ప్రమాదం ఉందన్నారు. సాగునీటి మాట దేవుడెరుగు కనీసం తాగునీటి వంతు విడుదల చేసి అడుగంటిన తాగునీటి చెరువులను నింపాలని సంబంధిత ఉన్నతాధికారులను కోరారు.

కుక్కల బెడద నివారించరూ..



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కొమ్ము ఆనందం

చాట్రాయి, జూన్ 22: కుక్కల స్వైర విహారంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారని, వాటిని నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతూ చిన్నంపేటకు చెందిన కొమ్ము ఆనందం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధుమేహం ఉన్న వృద్ధులను కుక్కలు కరవడం వల్ల గాయాలు మానక, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఒక్క చాట్రాయి పీహెచ్‌సీలోనే ఇలాంటివి 40 కేసుల 40 వరకు ఉన్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వీధికుక్కలను నియంత్రించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఫణిబాబును సత్కరిస్తున్న దృశ్యం

జనసేన ఆత్మీయ సమావేశం

చాట్రాయి, జూన్ 22: చాట్రాయిలో జనసేన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల్లో శక్తివంచన లేకుండా కూటమి విజయానికి కృషిచేసిన జనసేన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సూచనల మేరకు గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు. చాట్రాయి మండల నాయకులు తుమ్మల జగన్, వెల్లంకి శ్రీమన్నారాయణ, తగరం సురేష్, భాస్కర్‌రావు తదితరులు ఫణిబాబును సత్కరించారు.

టీటీడీకి కూరగాయల వితరణ



టీటీడీకి కూరగాయలు తరలిస్తున్న వాహనం

నూజివీడు టౌన్, జూన్ 22: టీటీడీలోని నిత్యాన్నదాన సత్రానికి నూజివీడుకు చెందిన పలువురు దాతలు కూరగాయలను విరాళంగా అందించారు. నూజివీడు నుంచి ప్రతినెలా అన్నదాన సత్రానికి కూరగాయలు తరలిస్తుండగా, శనివారం సుమారు 14 టన్నుల కూరగాయలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక వాహనంలో తిరుమలకు పంపినట్టు దాత నక్కా సత్యనారాయణ తెలిపారు. దొండ, బెండ, సొర తదితర కూరగాయలను వెంగమాంబ అన్నదాన సత్రానికి తరలించినట్టు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగాలకు 36 మంది ఎంపిక

నూజివీడు టౌన్, జూన్ 22: నూజివీడు సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో శనివారం దివిస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 66 మంది హాజరు కాగా, 36 మంది ఎంపికైనట్లు సంస్థ హెచ్ఆర్ రిక్రూటర్ కావూరి రామకృష్ణ తెలిపారు. కళాశాల డైరెక్టర్లు తోటకూర సాంబశివరావు, గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపాల్ ఎమ్మీ ఇద్రిస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



ముసునూరు, జూన్ 22: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో బీవీ సుబ్బారావు ఆదేశించారు. శనివారం గోగులంపాడులోని ఎంపీయూపీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. భోజనం రుచిపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి బోధించి వారు పాఠ్యాంశాల్లో పట్టు సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అవకతవకలకు పాల్పడినా, మెనూ ప్రకారం ఆహారం అందించకపోయినా వంట ఏజెన్సీలను రద్దు చేస్తామని హెచ్చరించారు. హెచ్ఎం రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

నేటి నుంచి అందుబాటులో కామినేని

కైకలూరు, జూన్ 22: కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నేడు, రేపు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వరహాపట్నంలో సోమ వారం సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు లోకుమూడిలోని ఎన్డీయే కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో జరిగే సమావేశంలో పాల్గొంటారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. అలాగే ఎమ్మెల్యేను కలిసేందుకు వచ్చే ప్రజలు బొకేలు, శాలువలు తీసుకురావద్దని, పుస్తకాలు తీసుకువస్తే పేద విద్యార్థులకు అందించవచ్చన్నారు.



మండవల్లిలో విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యా కిట్ల పంపిణీ

మండవల్లి, జూన్ 22: మండవల్లిలో ప్రాథమిక పాఠశాల-2 విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కిట్లు శనివారం పంపిణీ చేశారు. సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్, మండవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గుడివాడ చిట్టిబాబు, పాఠశాల హెచ్ఎం రాహేల్ పుస్తకాలు, కిట్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ముళ్లపూడి సత్తిబాబు, నల్లిబోయిన రాజేష్, కారి రాజు, ఆజాద్ పాల్గొన్నారు. అలాగే లింగాల గ్రామంలో విద్యార్థులకు పుస్తకాలు కిట్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, సహకార సంఘం అధ్యక్షుడు బాబు తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు